క్లుప్తంగా

వ్యవసాయ సాగులో విద్యార్థులు



శిక్షణ పొందుతున్న విద్యార్థినులు

జగిత్యాలరూరల్: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం అనుబంధ వ్యవసాయ కళాశాల బాబూ జగ్జీవన్‌రామ్ కళాశాల విద్యార్థినులు సోయ సాల్వెంట్ నూనె మిల్లులో శిక్షణ పొందుతున్నారు. శిక్షణలో భాగంగా సోమవారం విద్యార్థినులు కొడిమ్యాల మండలం పూడూరులో రైతులతో పంట పొలాల్లో సాగు విధానాన్ని పరిశీలించారు. నాగసత్య సాల్వెంట్ ఆయిల్‌మిల్లులో సోయ పంట ఉడికించి ముడిసోయ నూనె తయారుచేసే వరకు జరిగే వివిధ మిషనరీ ప్రక్రియను పరిశీలించి, తయారీ విధానాన్ని తెలుసుకుంటున్నారు. వారం రోజులుగా మిల్లులో శిక్షణ పొందుతున్నారు.

ఉత్తమ విద్య అందించడమే లక్ష్యం



విద్యార్థులను అభినందిస్తున్న నరేందర్‌రెడ్డి

జగిత్యాల: విద్యార్థులకు ఉత్తమ విద్య అందించడమే లక్ష్యమని అల్ఫోర్స్ అధినేత నరేందర్ రెడ్డి అన్నారు. ఇటీవల ప్రకటించిన ఎప్‌సెట్ ఫలితాల్లో ర్యాంకులు సాధించిన వారిని సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి కష్టపడి చదువుకుని ఉన్నత స్థానాలకు వెళ్లాలని సూచించారు. ర్యాంకులు సాధించిన వారిలో మధు 1551, అంకితసాయి 3005, గోపిక హర్షిత 3156, వర్షిత్ 4518, సాకేత్ 5881, అభినవ్7606, సిద్దార్థ 8399 ర్యాంకులు సాధించిన వారిలో ఉన్నారు.

ఆహార భద్రత అధికారుల తనిఖీ



మామిడి మార్కెట్‌లో తనిఖీ చేస్తున్న అనూష

జగిత్యాల: మ్యాంగో మార్కెట్‌లో కాల్షియం కార్బైడ్ వినియోగిస్తుండడంపై సోమవారం ఆహార భద్రత అధికారి అనూష ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. కొన్ని శాంపిల్స్ సేకరించారు .ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎలాంటి కెమికల్స్ ఉపయోగించినా చర్యలు తీసుకుంటామన్నారు.

ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో తనిఖీ

మెట్‌పల్లి: పట్టణంలోని పలు ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లల్లో సోమవారం మున్సిపల్ సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిషేధిత ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తున్న పలువురికి జరిమానా విధించారు. కవర్లకు బదులు జ్యూట్ సంచులు వినియోగించాలని వారికి సూచించారు. వ్యాపారులు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోవాలని, లేకుంటే జరిమానా విధిస్తామన్నారు. తనిఖీల్లో ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ రత్నాకర్, విష్ణు, ముజీబ్, పున్నం తదితరులు పాల్గొన్నారు.

శుద్ధ జలం సరఫరాకు ఏర్పాట్లు

- బీర్‌పూర్ మంచినీటి పథకం పునరుద్ధరణకు నిధులు
- రూ. 8 కోట్లతో ప్రతిపాదనలు మండల ప్రజలకు అందనున్న శుద్ధజలం



బీర్‌పూర్ ఘాట్‌పై ఏర్పాటు చేసిన భారీ నీటి ట్యాంకు

సారంగాపూర్: ఉమ్మడి సారంగాపూర్ మండల ప్రజలకు శుద్ధజలం అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఉమ్మడి మండలంలోని అన్ని గ్రామాలకు మిషన్ భగీరథ నీళ్లు అందలేదు. గతంలో బీర్‌పూర్ భారీ రక్షిత మంచినీటి పథకం కింద ఫిల్టర్‌బెడ్‌లను ఏర్పాటు చేసి రోళ్లవాగు ప్రాజెక్టు నీటిని శుద్ధిచేసి బీర్‌పూర్, ధర్మపురి మండలాల్లోని పలు గ్రామాలకు తాగునీటిని సరఫరా చేశారు. మిషన్ భగీరథ ప్రారంభైన తరువాత బీర్‌పూర్ రక్షిత మంచినీటి పథకం మూలకుపడిపోయింది.

నెరవేరని మిషన్‌భగీరథ లక్ష్యం

గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన మిషన్‌భగీరథలో ప్రజలకు శుద్ధజలం సరఫరా చేయాలన్న లక్ష్యం నెరవేరలేదు. మిషన్‌భగీరథ నీరు అందక ప్రజలు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. బీర్‌పూర్, సారంగాపూర్ మండలాలకు మిషన్‌భగీరథథ ప్లాంటు దాదాపు 40 కిలోమీటర్ల దూరంలో ఉండడంతో శుద్ధజలం అందడం లేదు.

పాత పథకం పునరుద్ధరణ

బీర్‌పూర్ భారీ రక్షిత మంచినీటి పథకాన్ని మరమ్మతు చేసి బీర్‌పూర్ మండలంలోని 17, సారంగాపూర్ మండలంలోని సారంగాపూర్, నాయికపుగూడెం, పోతారం, బట్టపల్లి గ్రామాలకు శుద్ధజలం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

రోళ్లవాగు నీటిని శుద్ధిచేసి నీటి సరఫరా

రోళ్లవాగు ప్రాజెక్టు సమీపంలో ఏర్పాటు చేసిన భారీ రక్షిత మంచినీటి పథకాన్ని పునఃరుద్ధరించి, శుద్ధ జలం అందించాలని ప్రజలు మాజీ మంత్రి జీవన్‌రెడ్డిని కోరగా దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకుపోగా, స్పందించిన సీఎం జగిత్యాల నియోజకవర్గంలోని పొలాస, రాయికల్‌తో పాటు, బీర్‌పూర్ పథకాలకు 13.97 కోట్లు మంజూరు చేశారు. దీనిలో బీర్‌పూర్ భారీ రక్షిత మంచినీటి పథకానికి రూ. 3.70 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులు సరిపోవని అధికారులు నివేదించడంతో తిరిగి రూ. 8 కోట్లతో ప్రతిపాదనలు పంపించారు. ఇది పూర్తయితే రోజు 50 లక్షల లీటర్ల నీటిని ప్రజలకు అందించనున్నారు. గతంలో నీటిని శుద్ధి చేయడానికి ఇసుకతో ఏర్పాటు చేసిన ఫిల్టర్‌బెడ్‌ల స్థానంలో నూతన సాంకేతికతో నీటిని శుద్ధిచేసే ప్లాంట్లను ఏర్పాటు చేసి, మిషన్‌భగీరథ కోసం ఏర్పాటు చేసిన పైప్‌లైన్లకు, ట్యాంక్‌లకు అనుసంధానం చేసి, ఆయా గ్రామాలకు మంచినీటిని అందించవచ్చు. దీని కోసం నిధులు మంజూరు చేసి, శుద్ధ జలం అందించాలని ప్రజలు కోరతున్నారు.

మిషన్ భగీరథ నీరందలేదు



గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన మిషన్‌భగీరథ పథకం పైప్‌లైన్ల నిర్మాణం సరిగ్గా లేకపోవడం, ఇతర సాంకేతిక కారణాలతో నీరు గ్రామాలకు చేరలేదు. ఇప్పటికి పదేళ్లయినా సమస్య అలాగే ఉంది. బీర్‌పూర్ భారీ రక్షిత మంచినీటి పథకం మరమ్మతు జరిగితే ప్రజలకు మంచినీరు అందుతుంది.

– మసర్తి రమేశ్, మాజీ ఎంపీపీ, బీర్‌పూర్

నీళ్లు తెచ్చుకుంటున్నాం



మిషన్ భగీరథ ద్వారా సరఫరా చేసే నీటిలో క్లోరినేషన్ లేకుండా పోతుంది. ఈ కారణంగా ఇళ్లలో తాగడానికి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ప్లాంట్ల ద్వారా నీళ్లు తెచ్చుకుంటున్నాం. బీర్‌పూర్ భారీ రక్షిత పథకం పునఃరుద్ధరించడానికి తాగు నీరు అందించడానికి ప్రభుత్వం చొరవచూపడం సంతోషం.

– చేకుట శేఖర్, సారంగాపూర్

రూ. 8 కోట్లతో ప్రతిపాదనలు

బీర్‌పూర్ భారీ రక్షిత మంచినీటి పథకం పునఃరుద్ధరించడానికి రూ. 8 కోట్లతో ప్రతిపాదనలు పంపించాం. ఈ నిధులు మంజూరైతే అడ్మినిస్ట్రేటివ్ అనుమతులు రాగానే టెండర్లు నిర్వహించి పనులు ప్రారంభిస్తాం.

– జలేందర్‌రెడ్డి డీఈ, మిషన్ భగీరథ గ్రిడ్ విభాగం

కోరుట్లలో కేడీసీసీ బ్యాంకు ప్రారంభం



బ్యాంకు ప్రారంభిస్తున్న కొండూరి, ఎమ్మెల్యే

కోరుట్ల: కోరుట్లలో నిర్మించిన కేడీసీసీబీ నూతన భవనాన్ని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ నాఫ్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావుతో కలిసి సోమవారం ప్రారంభించారు. జాతీయ బ్యాంకులకు దీటుగా లావాదేవీలు కొనసాగిస్తూ రైతులు, వ్యాపారులకు సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. బ్యాంకు అభివృద్ధికి రైతులు, వ్యాపారులు సహకరించాలని కాంగ్రెస్ కోరుట్ల ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. బ్యాంక్ మేనేజర్, సింగిల్‌విండో అధ్యక్షులు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఎరువులు అందుబాటులో ఉంచేందుకే గోదాములు

కోరుట్ల రూరల్: రైతులకు అన్ని రకాల ఎరువులను అందుబాటులో ఉంచేందుకే సహకార సంఘాల ఆధ్వర్యంలో గోదాముల నిర్మిస్తున్నామని కొండూరి రవీందర్ రావు అన్నారు. మండలంలోని సర్వరాజ్‌పూర్, పైడిమడుగు, జోగిన్‌పెల్లి గ్రామాల్లోని ఎరువుల గోదాములను ఎమ్మెల్యేతో కలిసి ప్రారంభించారు.

మల్లాపూర్‌లో..

మల్లాపూర్: మండల కేంద్రంలో నిర్మించిన కేడీసీసీ బ్యాంకును నాఫ్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్ రావు, ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్‌తో కలిసి ప్రారంభించారు. కార్యక్రమాల్లో కేడీసీసీ బ్యాంక్ సీఈవో ఎస్.సత్యనారాయణ, వైస్ చైర్మన్ మోహన్‌రెడ్డి,సొసైటీ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, డైరెక్టర్లు, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా బుద్ధ పూర్ణిమ వేడుకలు



బుద్ధుడి విగ్రహానికి నాయకులు, విద్యార్థుల నివాళి

ఇబ్రహీంపట్నం: మండలంలోని గోధూర్‌లో కళాశక్తి గోధూర్ ఆధ్వర్యంలో సోమవారం బుద్ధ పూర్ణిమ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుద్ధుడి విగ్రహానికి పూలమాలలు వేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గోధూర్ మురళి, మాజీ ఎంపీపీ కోటగిరి వెంకటస్వామి, వీడీసీ అధ్యక్షుడు ఎడపెల్లి స్వామి, బురం సంజీవ్, బండి రాజేశ్, ఇంద్రాల గంగాధర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణ గీతాశ్రమ వార్షికోత్సవం

ధర్మపురి: మండలంలోని తీగలధర్మారం గ్రామంలో శ్రీకృష్ణ గీతాశ్రమ 45వ, వార్షికోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. యజ్ఞ నిర్వాహకులు వేముల రామ్‌రెడ్డి, ఆలయ అధ్యక్షుడు రాజిరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమానికి ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ హాజరై ఆలయ అభివృద్ధికి తన వంతు సాయం అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు జంగిలి ప్రభాకర్, పందిరి తిరుపతి, గంధం రమేశ్, తిరుపతి పాల్గొన్నారు.

సర్వాయి పాపన్న ఆశయాలు కొనసాగించాలి



పాపన్న విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నర్సింగరావు

ఇబ్రహీంపట్నం/ మెట్‌పల్లిరూరల్: సర్దార్ సర్వాయి పాపన్న ఆశయాలను కొనసాగించాలని కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గం ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. సోమవారం మండలంలోని డబ్బా గ్రామంలో, మండలకేంద్రంలో మేడిపల్లి క్రాసింగ్ వద్ద సర్వాయి పాపన్న విగ్రహాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో్న గీత కార్మికుల సంఘం రాష్ట్ర నాయకుడు మల్లేశం గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెర్లపల్లి రాజేశ్వర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

మల్లాపూర్: మండలంలోని సాతారం, రేగుంట, గొర్రెపల్లి, సంగెం–శ్రీరాంపూర్ గ్రామాల్లో జువ్వాడి నర్సింగరావు సోమవారం పర్యటించారు. సాతారంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. రేగుంట, గొర్రెపల్లి, సంగెం–శ్రీరాంపూర్ గ్రామాల్లో రేషన్ దుకాణాలను ప్రారంభించారు. బీఆర్‌ఎస్, బీజేపీలు చేస్తున్న డ్రామాలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు.కార్యక్రమాల్లో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎలాల జలపతిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ అంతడపుల పుష్పలత ,కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పూంద్ర శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరిస్తా

రాయికల్: పట్టణంలోని మూడో వార్డులోని తుర్కాశీనగర్ కాలనీలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని కాలనీవాసులు సోమవారం మాజీమంత్రి జీవన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆయన వెంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపి రాజిరెడ్డి, కొయ్యడి మహిపాల్‌రెడ్డి, అశోక్, శివ, గౌరెమియా, ఖాసీం, ఇబ్రహీం పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి రెండు రోజుల జైలు

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన వ్యక్తికి రెండు రోజుల జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లోని పాలెంకు చెందిన మాచునూరి కొండయ్య మద్యం సేవించి వాహనం నడుపగా ట్రాఫిక్ ఎస్సై మల్లేశ్ కేసు నమోదు చేశారు. నిందితుడిని సోమవారం స్పెషల్ జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ సెకెండ్‌క్లాస్ ముందు హాజరుపర్చగా న్యాయమూర్తి కరుణాకర్ కొండయ్యకు రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

▸అర్హులకు ఇళ్లు మంజూరు చేయాలని వినతి

కథలాపూర్: మండలంలోని గ్రామాల్లో రాజకీయాలకు అతీతంగా అర్హులైన పేదలకు ఇళ్లు మంజూరు చేయాలని బీజేపీ నాయకులు ఎంపీడీవో శంకర్‌కు సోమవారం వినతిపత్రం ఇచ్చారు. అధికార పార్టీ నాయకుల సిఫార్సుతో ఆర్థికంగా ఉన్నవారికి ఇళ్లు మంజూరు చేయడం సరికాదన్నారు. ఇళ్లు లేని వారికి మొదట ప్రాధాన్యత ఇచ్చి కాంగ్రెస్ చిత్తశుద్ధి చాటుకోవాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు మల్యాల మారుతి, నాయకులు కంటె సత్యనారాయణ, వెంకటేశ్వర్‌రావు, గాంధారి శ్రీనివాస్, కథలాపూర్ మహేశ్, కోరుట్ల రాజేశ్, నరెడ్ల రవి, జీవన్‌రెడ్డి, శ్రీకర్ పాల్గొన్నారు.

▸ గ్రామాల్లో నిరక్షరాస్యులను గుర్తించాలి

కథలాపూర్: గ్రామాల్లో నిరక్షరాస్యులను గుర్తించాలని కథలాపూర్ ఎంఈవో లోకిని శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండలకేంద్రంలో సెర్ప్ కార్యాలయంలో మండలంలోని వివిధ గ్రామాల మహిళా సంఘాల ప్రతినిధుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 25 ఏళ్లలోపు ఉన్నవారు నిరక్షరాస్యులైతే ఓపెన్ టెన్త్ పరీక్షలకు సిద్ధం చేయాలన్నారు. 60 ఏళ్లలోపు ఉన్నవారు నిరక్షరాస్యులైతే మండల విద్యాధికారికి సమాచారం ఇవ్వాలని మహిళా సంఘాలను కోరారు. సమావేశంలో ఏపీఎం నరహరి పాల్గొన్నారు.

▸ఎరువుల వాడకంపై నియంత్రణ పాటించాలి

సారంగాపూర్: రైతులు రసాయనిక ఎరువుల తోపాటు, పురుగు మందుల వాడకంపై పూర్తి నియంత్రణ పాటించాల్సిన అవసరం ఉందని పొలాస వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు అన్నారు. సోమవారం బీర్‌పూర్ మండలంలోని కోమన్‌పల్లి, కండ్లపల్లి గ్రామాల్లో రైతు ముంగిట శాస్త్రవేత్తలు అనే కార్యక్రమంలో భాగంగా రైతులు ప్రస్తుతం ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో బిజీగా ఉండడంతో శాస్త్రవేత్తలు నేరుగా కేంద్రాల వద్దకు వెళ్లి రైతులకు సాగువిధానంలో ఆధునిక పద్ధతులు, పురుగుల మందుల అధిక వినియోగంపై వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు మహేష్, సౌజన్య, వి.రత్నాకర్, మండల వ్యవసాయాధికారి ప్రదీప్‌రెడ్డి, కరీంనగర్ విత్తనాధికారి శ్రీకాంత్, ఏఈవోలు వినోద్, శిరీష, , రైతులు పాల్గొన్నారు.

▸గోవధ, అక్రమ రవాణాను నిలిపివేయాలి

ధర్మపురి: గోవధతో పాటు వాటి అక్రమ రవాణాపై కఠిన నిర్ణయాలు తీసుకోవాలని కోరుతూ సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. దేశీ గోవంశ రక్షణ సంవర్ధన సమితి–తెలంగాణ గో రక్ష విభాగం విశ్వహిందూ పరిషత్ ధర్మపురి ఆధ్వర్యంలో తహసీల్దార్ కృష్ణచైతన్య, సీఐ రాంనర్సింహరెడ్డి కి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ నాయకులు దుర్గాప్రసాద్, కస్తూరి రాజన్న, మ్యాన పూర్ణచందర్, ముత్యపు రమేష్, రంగు శ్రీధర్ తదితరులున్నారు.

▸ జలకడుగు సంక్షేమ సంఘం రాష్ట్ర నూతన కార్యవర్గం

కోరుట్ల: జలకడుగు సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గాన్ని పట్టణంలోని ఐబీ గెస్ట్ హౌజ్‌లో సోమవారం ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా చెరుకు సమ్మయ్య,ఉపాధ్యక్షుడిగా కట్కూరి కాశీ, రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలిగా జిల్లా పద్మ, ఉపాధ్యక్షురాలిగా గుర్రపు సోసమ్మ, ప్రధాన కార్యదర్శిగా దొంతి మంగ, రాష్ట్ర యూత్ అధ్యక్షుడిగా మామిడి బ్రహ్మయ్య, ఉపాధ్యక్షుడిగా అగ్గల్ల వీరస్వామి, ప్రధాన కార్యదర్శిగా విష్ణు సత్యనారాయణ తో పాటు అన్ని జిల్లా అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో వరంగల్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్, కరీంనగర్, హైదరాబాద్ ఉమ్మడి జిల్లాల సభ్యులు పాల్గొన్నారు.

▸పైడిమడుగు పద్మశాలీ సంఘం కార్యవర్గం

కోరుట్ల రూరల్: మండలంలోని పైడిమడుగు గ్రామ పద్మశాలీ కులోన్నతి సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అంకం బాబులాల్, ఉపాధ్యక్షుడిగా అంకం శ్రీధర్, కార్యదర్శిగా ఆడెపు భూమేశ్వర్,కోశాధికారిగా కట్కం రాము, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

▸ 'ఉల్లాస్' విజయవంతం చేయాలి

పెగడపల్లి: మండలంలో చేపట్టనున్న ఉల్లాస్ విజయవంతం చేయాలని, వెంటనే కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల ఉల్లాస్ సమన్వయ కమిటీ సభ్యులతో సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. మండలంలో 18 నుంచి 60 ఏళ్లలోపు నిరక్షరాస్యులైన మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దుటయే ఉల్లాస్ ప్రధాన ఉద్దేశ్యమన్నారు. సమావేశంలో ఎంపీవో మహేందర్, ఎంఈవో సులోచన, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మహేశ్వరి, ఏపీఎం సమత పాల్గొన్నారు.

▸ నర్సులకు సన్మానం

రాయికల్: అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా రాయికల్ పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో సోమవారం నర్సులను లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ శశికాంత్‌రెడ్డి మాట్లాడుతూ, నర్సుల సేవలు మరువలేనివని తెలిపారు. కార్యక్రమంలో డీజీవో ఒడ్నాల రజిత, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మచ్చ శేకర్, ప్రధాన కార్యదర్శి కడకుంట్ల నరేశ్, సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం వద్ద రైతుల ఆందోళన



విచారణ చేస్తున్న అధికారి

ధర్మపురి: మండలంలోని రాయపట్నం ధాన్యం కొనుగోలు కేంద్రంలో తూకంలో ఓ రైతు ధాన్యం 40 కిలోకు కాకుండా 3 కిలోలు అదనంగా తూకం వేశారని సోమవారం రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ధాన్యంలో తూకంలో మోసం జరిగిందంటూ గ్రామానికి చెందిన గోపతి తిరుపతి అనే రైతు సిబ్బందిని నిలదీశాడు. నిర్వాహకులు పొంతన లేని సమాదానం చెప్పడంతో గ్రామానికి చెందిన రైతులంతా కేంద్రం వద్దకు చేరుకుని ఆందోళన చేపట్టారు. రైతు ధాన్యం మరోసారి తూకం వేయగా 43 కిలోలు వచ్చింది. తూకంలో జరిగిన వ్యత్యాసంపై సంబంధిత జిల్లా అధికారులకు సమాచారం అందించారు. అక్కడికి మోకాపై చేరుకుని పరిస్థితి సద్దుమణిగేలా చేశారు. ఇలాంటివి పునరావృతం కాకుండా చూసుకోవాలని నిర్వాహకులకు సూచించారు.



రాయికల్: పట్టణంలోని అయ్యప్ప ఆలయం వద్ద ఉన్న కల్వర్టుకు ఇటీవల మరమ్మతు కోసం మున్సిపల్ సిబ్బంది తొలగించారు. నేటి వరకు కల్వర్టు పైప్‌లైన్ బిగించకపోవడంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా మున్సిపల్ కమిషనర్ స్పందించి పైప్‌లైన్ మరమ్మతులు నిర్వహించాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
మనోహర్‌గౌడ్, బల్దియా కమిషనర్ రాయికల్ సెల్ నం.: 8919777985

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

నిధులు మంజూరు చేయాలని వినతి



వినతిపత్రం అందిస్తున్న గౌడ సంఘం నాయకులు

జగిత్యాలరూరల్: మండలంలోని వెల్దుర్తి ఎల్లమ్మగుడికి వెళ్లే రహదారికి సీసీరోడ్డు, గుడిలో వంటశాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని గీత పారిశ్రామిక సహకార సంఘం సభ్యులు సోమవారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. అలాగే కాటమయ్య రక్షణ కిట్లు కూడా అందజేయాలని కోరారు. నిధుల మంజూరుకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు మల్లారెడ్డి, వెంకటేశ్వర్‌రావు, నరేశ్‌గౌడ్, గంగాధర్‌గౌడ్, మహేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఎమ్మెల్యే అభినందన

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని నవ్య జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు ఎప్‌సెట్ పరీక్షల్లో ప్రతిభ కనబర్చగా వారిని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ర్యాంకులు సాధించిన విద్యార్థులు మరింత ఉన్నతస్థాయికి వెళ్లాలన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్లు నరేశ్, గాలపల్లి ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్

మెట్‌పల్లి: విద్యుత్ సరఫరాలో సమస్యలను పరిష్కరించడానికి సిబ్బంది కృషి చేయాలని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ సూచించారు. పట్టణంలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం విద్యుత్ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. విద్యుత్ సమస్యలు..వాటిని పరిష్కారానికి తీసుకుంటున్న చర్యల గురించి చర్చించారు. సమావేశంలో డీఈ గంగారాం, ఏడీఈలు మనోహర్, రఘుపతి,ఏఈలు పాల్గొన్నారు.

బహుజన పోరాటయోధుడు సర్వాయి పాపన్న

మల్లాపూర్: బహుజనుల పోరాటయోధుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. మండలంలోని చిట్టాపూర్‌లో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాన్ని సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ నేరెళ్ల మోహన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు తోట శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

కనుల పండువగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

రాయికల్: మండలంలోని భూపతిపూర్, మూటపల్లిలో వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని సోమవారం కనుల పండువగా నిర్వహించారు. ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వేద మంత్రోచ్చరణల మధ్య కల్యాణం జరిపించారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, మాజీమంత్రి జీవన్‌రెడ్డి స్వామివారిని దర్శించుకున్నారు.

ఘనంగా లక్ష్మీనృసింహస్వామి జాతర



స్వామివారి దర్శనానికి బారులుదీరిన భక్తులు

కథలాపూర్: మండలంలోని దుంపేటలో శ్రీలక్ష్మీ నృసింహస్వామి జాతర సోమవారం ఘనంగా నిర్వహించారు. గుట్టపై ఉన్న స్వామివారిని దర్శించుకునేందుకు వేలాదిమంది భక్తులు బారులు తీరారు. ఆలయంలో పూజలు చేసిన భక్తులు టెంకాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. జాతర ఉత్సవాలకు హాజరైన భక్తులకు నిర్వాహకులు అన్నదానం చేశారు. ఉత్సవాల్లో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి లోక బాపురెడ్డి, బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహరావు, ఏనుగు మనోహర్‌రెడ్డి, భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

సైనికుల కోసం 108 కలశాలతో అభిషేకం



రాయికల్: దేశ సరిహద్దుల్లో ఉన్న సైనికులకు దుర్గాదేవి ఆశీస్సులు ఉండాలని కోరుతూ రాయికల్ మండలం మైతాపూర్ గ్రామంలోని దుర్గాదేవి ఆలయంలో సోమవారం 108 రకాల కలశాలతో అర్చకులు జగదీశ్వర్ ఆధ్వర్యంలో అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో సభ్యులు గంగమల్లయ్య, దుంపాల గంగారెడ్డి, అమర్, సతీశ్, లింగారెడ్డి, రాజు, జైపాల్ పాల్గొన్నారు.